క్లుప్తంగా

ఉపాధి వేతనదారులు వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి

కె.కోటపాడు: ఉపాధి వేతనదారులు ఉదయం పనులకు వేగంగా వెళ్లాలని ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. సూదివలస గ్రామంలో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. వేసవి ఉష్ణోగ్రతల బారిన పడకుండా ఉండేందుకు పలుచటి వస్త్రాన్ని తలకి ధరించడంతో పాటు మంచినీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పని ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్పీ యాళ్ల సాయి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల జాతరలు



మావుళ్లమ్మను దర్శించుకుంటున్న సర్పంచ్ తదితరులు

మాకవరపాలెం: శెట్టిపాలెంలో బోడకొండమ్మతల్లి, బయ్యవరంలో మావుళ్లమ్మ అమ్మవారి జాతరలను గురువారం స్థానికులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. రాత్రికి కమిటీల అధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్‌లు లాలం కాశీవిశ్వనాథ్, అల్లు రామునాయుడు, విజయవాడకు చెందిన ఎస్‌బీ సీఐ కె.శివాజీ అమ్మవార్లను దర్శించుకున్నారు.

కంటి సమస్యలను అలక్ష్యం చేయరాదు

కె.కోటపాడు: కంటి సమస్యల్లో గ్లకోమా (నీటి కాసులు) నయం కాని వ్యాధి అని సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి అన్నారు. ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది కె.కోటపాడులో గురువారం గ్లకోమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న మంగపతి మాట్లాడుతు గ్లకోమా కంటి సమస్య పెద్దవారితో పాటు పిల్లల్లోనూ వస్తుందన్నారు. కంటి సమస్యలను ఏమాత్రం అలక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యం చేయించుకోవాలన్నారు. ఉపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా

కె.కోటపాడు: ప్రభుత్వం చెరకు రైతును ఆదుకోవాలన్న నినాదంతో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఈ నెల 21న రైతులతో కలిసి ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలో రొంగలినాయుడుపాలెం, మల్లంపాలెం, పైడంపేట, చౌడువాడ గ్రామాల్లో గురువారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చెరకు రైతుల సమస్యలు, సాగుకు పెడుతున్న పెట్టుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు, యర్రా దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మహిళల ఫిర్యాదు

కె.కోటపాడు: లంకవానిపాలెంలో వివాదంలో ఉన్న 98 సెంట్ల భూమి దురాక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి లంకవానిపాలెం గ్రామానికి చెందిన మహిళలు విన్నవించారు. ఈ స్థలాన్ని గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని, అందులో భాగంగానే అక్కడున్న రెండు బడ్డీలను ధ్వంసం చేసినట్లు వీరు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆ స్థలం సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు గ్రామస్తుడు కోరుపోలు రామకృష్ణ పేర్కొన్నారు. పోలీసులు, దేవదాయ శాఖ అధికారులతో తాను మాట్లాడతానని మహిళలకు ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చినట్లు రామకృష్ణ తెలిపారు. కోరుపోలు చిన్నమ్మలు, దేముడమ్మ, వరలక్ష్మి, నాగమణి బండారును కలిసిన వారిలో ఉన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు

కె.కోటపాడు: గ్రామంలో వీఎంఆర్డీఏ నిర్మించనున్న కల్యాణ మండపానికి సంబంధించిన స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, అడిషినల్ కమిషనర్ రమేష్ పరిశీలించారు. తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల వెనుక భాగంలో ఉన్న స్థలాన్ని అధికారులు వారికి చూపించారు. స్థలం సమకూరితే వీఎంఆర్డీఏ ద్వారా కల్యాణ మండపం నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



విద్యార్థులతో జూనియర్ సివిల్ జడ్జి రోహిత్, పోలీస్ అధికారులు

నర్సీపట్నం: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ పేర్కొన్నారు. వేములపూడి హైస్కూల్, మోడల్ స్కూల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జడ్జి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమన్నారు. సీఐ ఎల్.రేవతమ్మ మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు 100, 112, 1930, 1098 నంబర్లకు కాల్ చేస్తే పోలీసులు రక్షణగా నిలుస్తారన్నారు. ఎస్సై రాజారావు, ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం చట్టాలపై విద్యార్థులకు, కాశీపురంలో మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. చోడవరం మండల న్యాయ సేవ అధ్యక్షులు, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖ అధికారి-1 బి.పడాల్‌దాస్, ఎంఈవో-2 వి.ఉషారాణి, కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



వెంకట రమణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నాతవరం: సీనియర్ నాయకుడు సిద్దాబత్తుల వెంకట రమణను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ గురువారం పరామర్శించారు. వెంకట రమణ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో విశాఖలో వైద్యం పొందుతూ బుధవారం సాయంత్రం స్వగ్రామానికి వచ్చారు. ఆయనను మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ గురువారం మాధవ నగరంలోని ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు కాపారపు అప్పల నర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టరు పైల పోతురాజు, పి.జగ్గంపేట సర్పంచ్ జి.వి.రెడ్డి, సోమన్నదొర, గన్నవరం సర్పంచ్ బొడ్డు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



రావికమతం పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యయులు

రావికమతం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఫేర్‌వెల్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఆట పాటలతో అలరించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశలో టెన్త్ కీలకమని, మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చీడికాడ: మండలంలోని మంచాల మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీటు సాధించిన బాలికలకు వసతిగృహంలో అవకాశం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

ఎ.కోడూరు హైస్కూల్ విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు



యశ్వంత్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం కామేశ్వరరావు

కె.కోటపాడు: ఇన్‌స్పైర్ అవార్డు (2024-25)కు ఎ.కోడూరు హైస్కూల్ విద్యార్థి తయారు చేసిన నమూనా ఎంపిక అయింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎంవీఎస్ యశ్వంత్ వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో ముందు, వెనుక భాగాల్లో ఇతర వాహనాల ద్వారా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆర్డినో బేస్డ్ వెహికల్ ఓవర్ టేకింగ్ వార్నింగ్ సిస్టమ్ ప్రాజెక్ట్ రూపొందించారు. ఇది ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక అయింది. ప్రాజెక్ట్ తయారు చేసిన యశ్వంత్‌కు రూ.10 వేల నగదును అందజేయనున్నట్లు హెచ్‌ఎం కామేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో గురువారం విద్యార్థి యశ్వంత్‌ను హెచ్‌ఎం కామేశ్వరరావు, బయాలజీ ఉపాధ్యాయిని కవిత అభినందించారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



ప్రమాణం చేస్తున్న పూర్వ విద్యార్థులు

బుచ్చెయ్యపేట: మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల గౌరవ సంఘం అధ్యక్షుడిగా డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు (వైఎస్సార్‌సీపీ నాయకుడు) ఎన్నికయ్యారు. గురువారం వడ్డాది హై స్కూల్లో 1959 నుండి చదువుకున్న పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 30 నుండి 85 ఏళ్ల వయసున్న పూర్వ విద్యార్థులు సందడి చేశారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. గత ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన సకలా కార్తీక్, కుబిరెడ్డి మానస వర్షి, బొడ్డు నాగేశ్వరిదేవి, అడపా హర్ష, గేదెల అమృత, పప్పల మృదులకు రూ. 31 వేల నగదు అందించారు.

సత్యవరంలో కవయిత్రి మొల్ల జయంతి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సాలివాహన సంఘ సభ్యులు

మాడుగుల: సత్యవరం గ్రామంలో సహజ కవయిత్రి మొల్ల జయంతి కుమ్మరి సాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి భక్తులకు అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి మాతృభాషపై పట్టు సాధించాలని సాలివాహన సంఘ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో గల సుమారు 30 మంది కుమ్మరి సాలివాహన సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర వేడుకగా కవయిత్రి మొల్ల జయంతి..

నర్సీపట్నం: మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వ పండగగా జరుపుకోవటం సంతోషంగా ఉందని కుమ్మరి శాలివాహన మాజీ డైరెక్టర్ అర్జున్ వెంకట్రావు అన్నారు. కవయిత్రి తెలుగులో రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు.

కొత్తూరు కుమ్మరి వీధిలో..

బుచ్చెయ్యపేట: వడ్డాది కొత్తూరు కుమ్మరి వీధిలో మొల్లమాంబ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, గ్రామ నాయకులు దొండా నరేష్, గిరిబాబు, దాడి సూరి నాగేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు ఎ. సూర్యప్రకాష్, వరహాలబాబు, సత్యనారాయణ, రమణ,లోవరాజు పాల్గొన్నారు.

ముందస్తు హోళీ సంబరాలు

కె.కోటపాడు: స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు హోళీ వేడుకలను గురువారం విద్యార్థులు జరుపుకున్నారు. చిట్టి చేతులకు పలు రకాలైన రంగులు అద్దుకుని తోటి విద్యార్థులకు పూసారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి: దేవరాపల్లి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు తెలిపారు. ఆస్పత్రి భవనానికి లైన్ షిఫ్టింగ్‌తో పాటు నిర్వహణ పనులు చేపడతామన్నారు. ఈ కారణంగా జూనియర్ కాలేజీ, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రి, మెయిన్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే తారువ ఫీడర్‌లో కూడా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ కారణంగా తెనుగుపూడి, వెంకటరాజుపురం, గరిశింగి, గరిశింగి శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలి

దేవరాపల్లి: జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర స్పష్టం చేశారు. దేవరాపల్లి మండలం గరిశింగి పంచాయతీ పరిధిలోని నాలుగు గిరిజన గ్రామాలకు చెందిన రైతులతో గురువారం వేలంబయలులో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మద్దతు ధర కల్పించాలని కోరుతూ గిరిజన రైతులు నినాదాలు చేశారు. జీడి రైతులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు.

మంచి నీటి సౌకర్యం కల్పించాలని వినతి

రావికమతం: చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామమైన సోంపురం బంధలుకు మంచినీటి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచి నీళ్లు లేక గెడ్డ నీరు తాగడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని, మంచినీటి సౌకర్యం కల్పించాలని గేమలి శ్రీను, మర్రి చిలుకమ్మ, మర్రి గౌరి తదితరులు కోరారు.

రేపటి నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు

మాడుగుల రూరల్: వేసవి దృష్ట్యా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహిస్తామని స్థానిక ఎంఈఓ-2 బి. దేముడమ్మ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. పదవ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు.

మండల విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడిగా దేముళ్లు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మండల విశ్వ హిందూ పరిషత్ నూతన కమిటీని గురువారం సాయంత్రం ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా కరణం దేముళ్లు, ఉపాధ్యక్షులుగా అప్పాన ప్రసాద్, దామరౌతు భవానీ, ప్రధాన కార్యదర్శిగా పెచ్చేట్టి కొండలరావు తదితరులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిమి కాసుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సర్వేలపై అవగాహన

చీడికాడ: స్వమిత్వా సర్వే నిర్దీత కాలంలోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి తెలిపారు. చీడికాడలో సంక్షేమ పథకాలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా సచివాలయం, సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు సర్వేలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీడీవో హేమసుందర్‌రావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ గోపి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి


నర్సీపట్నం: ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వేములపూడి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాలన్నారు. మే 22వ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాలాబులో రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం

దేవరాపల్లి: మండలంలోని గిరిజన పంచాయతీ వాలాబుకు సమీపంలోని కొండ ప్రాంతంలో గురువారం రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. చీడికాడ మండలం రెల్లలపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పోడు సాగు పనుల నిమిత్తం తమ ద్విచక్ర వాహనాలను రోజూ మాదిరిగా కొండ దిగువున పార్కింగ్ చేసి వెళ్లారు. పనులు ముగించుకొని వచ్చి చూడగా పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు బీడీ లేదా చుట్ట వెలిగించి పడేయడంతోనే మంటలు చెలరేగి ద్విచక్ర వాహనాలు దగ్ధమై ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బాధితులు బోరున విలపిస్తున్నారు.

నేడు వడ్డాది వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవం

- లక్ష మంది భక్తులు వస్తారని అంచనా
- 140 మంది పోలీసులతో భారీ బందోబస్తు



శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవం శుక్రవారం వేడుకగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు 15 వరకు జరుగుతాయి. వేడుకల్లో ప్రాముఖ్యత గల నాగవల్లి వసంతోత్సవాన్ని తిలకించడానికి ఏటా లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. శ్రీదేవి, భూదేవితో వివాహం అయిన వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకిలో కూర్చోబెట్టి మేళతాళాలు, డప్పులు, వాయిద్యాల నడుమ వడ్డాది పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఊరేగింపులో పలువురు భక్తులు స్వామి వారిపై గంధం చల్లుతారు. తిరువీధి ఉత్సవంలో వేంకటేశ్వరస్వామి పల్లకి మోయడానికి, గంధం జల్లడానికి భక్తులు పోటీ పడతారు. శారదా నదిలో వేంకటేశ్వర స్వామివారికి చక్రస్నానం చేయిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 140 మంది పోలీసులతో వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్ నుండి గిరిజాంబ కొండ వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల కోసం క్యూలైన్‌లు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు, ఈవో శర్మ తెలిపారు.



విద్యుత్ కాంతుల్లో వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయం



ఉత్సవాల బందోబస్తుకు వచ్చిన పోలీసు సిబ్బంది



స్వామి వారి ఉత్సవాల్లో భక్తులు